సాక్షి మెదక్

గురువారం । 29 । జూన్ । 2023



దుక్కులు దున్ని.. విత్తనాలు చల్లి

ఇటీవల కురుస్తున్న వర్షాలతో అన్నదాతలు పొలంబాట పట్టి సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. దుక్కిదున్ని విత్తనాలు వేస్తున్నారు. 8లో



అక్రమ నిర్మాణాలపై చర్యలు ఏవీ?

నర్సాపూర్‌లోని అసైన్డ్ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా చర్యలు తీసుకోవడం లేదని సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 9లో

దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో తాత్కాలిక పద్ధతిన ఉపాధ్యాయుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు అదనపు కలెక్టర్ రమేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30 నుంచి జూలై 5 వరకు దరఖాస్తులను మెదక్ పట్టణంలోని మినీ గురుకులంలోని ప్రాంతీయ సమన్వయకర్త కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

న్యూస్‌రీల్

ఎంసెట్ ధ్రువపత్రాల పరిశీలన

మెదక్‌జోన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఎంసెట్ ధ్రువపత్రాల పరిశీలనకు బుధవారం 267 మంది విద్యార్థులు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సువర్ణలత తెలిపారు. మరో రెండు రోజుల పాటు ధ్రువపత్రాల పరిశీలన కొనసాగుతుందని చెప్పారు.

ఎంజేపీలో అడ్మిషన్లు

మెదక్‌జోన్: పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే డిగ్రీ కళాశాలలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ మదర్ సాహెబ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో బీఏ (ఈపీహెచ్) బీకాం(జనరల్) ఎంకాం (సీఏ) ఎంపీసీ, ఎంఈసీఎస్, బీజెడ్‌సీ.. మొదలగు కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమాచారం కోసం 9959158959 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

'బీడీ కార్మికులను మోసం చేయడం సరికాదు'

రామాయంపేట(మెదక్): రాష్ట్రంలోని బీడీ కార్మికులకు బీడీ కార్ఖానాలు సరైన పని కల్పించడంలేదని తెలంగాణ నూతన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివంది సత్యం ఆరోపించారు. బుధవారం రామాయంపేటలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నెలలో కనీసం 26 రోజులు కార్మికులకు పని కల్పించాల్సి ఉందన్నారు. దాదాపు అన్ని కంపెనీలు వారిని మోసగిస్తున్నాయని మండిపడ్డారు. కొన్ని కంపెనీలు కార్మికులకు పీఎఫ్ కట్టడం లేదని, దీంతో వారు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కార్మికశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

'సమ్మె కాలపు వేతనం చెల్లించండి'

మెదక్‌జోన్: డిమాండ్ల సాధన కోసం 80 రోజుల పాటు సమ్మె చేసిన వీఆర్‌ఏలకు సమ్మె కాలపు వేతనం ఇచ్చి ఆదుకోవాలని వీఆర్‌ఏల సంఘం జిల్లా నాయకుడు గడ్డం మహిపాల్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. చిన్నపాటి ఉద్యోగులం అయిన తమకు మూడు నెలల వేతనాలు నిలిచిపోవడంతో ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యుత్ అధికారులపై ఆగ్రహం



సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

అల్లాదుర్గం(మెదక్): విద్యుత్ సరఫరాలో అంతరాయంపై మండల పరిధిలోని మందాపూర్ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం అల్లాదుర్గం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించి ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పగలు, రాత్రి అనే తేడా లేకుండా కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నారని వాపోయారు. మంగళవారం రాత్రి నుంచి గ్రామంలో విద్యుత్ నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బంది పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నపాటి వర్షం, గాలి వీచినా గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని పేర్కొన్నారు. మరమ్మతులకు నిధులు మంజూరైన అధికారులు పనులు చేయడం లేదని మండిపడ్డారు. 15 రోజుల్లో సింగిల్ ఫేస్, రెండు నెలల్లో త్రీఫేస్ కరెంట్ సమస్య లేకుండా చేస్తామని విద్యుత్ అధికారులు హామీ ఇచ్చారు. ఆందోళనలో సర్పంచ్ రాజు, ఎంపీటీసీ దుర్గయ్య, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఇతరుల అకౌంట్‌లో ధాన్యం సొమ్ము జమ

శివ్వంపేట(నర్సాపూర్): సిబ్బంది తప్పిందంతో ధాన్యం డబ్బులు రైతు ఖాతాలో జమ కావాల్సి ఉండగా ఇతరుల ఖాతాలో జమ అయ్యాయి. మండల పరిధి గోమారం గ్రామానికి చెందిన పెద్దపట్లోరి హన్మంత్‌రెడ్డి మేలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో 67 బస్తాలు విక్రయించాడు. తూకం అనంతరం ట్రక్‌షీట్ ద్వారా సత్యసాయి రైస్‌మిల్‌కు ధాన్యం తరలించాడు. ధాన్యం డబ్బులు తన ఖాతాలో జమయ్యేందుకు గానూ పట్టాదార్ పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డుతో పాటు బ్యాంకు అకౌంట్ వివరాలు అందజేశాడు. వివరాల నమోదులో సిబ్బంది అలసత్వం ప్రదర్శించడంతో ఇతరులు ఖాతాలో డబ్బులు జమ అయ్యాయి. ఖాతా వివరాలు ఆరా తీయగా కర్ణాటకలోని బెంగుళూరు ప్రాంతానికి చెందిన వ్యక్తిగా ఉందని.. అతని ఖాతాలో నాకు రావాల్సిన ధాన్యం డబ్బులు రూ. 55,208 పడ్డాయని రైతు వాపోయాడు. సిబ్బంది తప్పిదంతో ఇతరుల ఖాతాలో డబ్బులు జమ అయిన విషయం వాస్తవమేనని సోమవారం వరకు రైతు ఖాతాలోకి డబ్బులు వచ్చేలా చర్యలు తీసుకుంటామని పీఏసీఎస్ సీఈఓ మధు చెప్పారు.

ఆందోళన వద్దు.. అదను దాటలేదు

- స్వల్పకాలిక వరిసాగు మేలు
- వేసవి దుక్కులు.. పంట మార్పిడి తప్పనిసరి
- వ్యవసాయ శాఖ టెక్నికల్ ఏడీఏ రాజ్‌నారాయణ
- 'సాక్షి' ఫోన్ ఇన్‌కు విశేష స్పందన

మెదక్‌జోన్: రుతుపవనాల రాక ఆలస్యమైంది.. రైతులు ఎలాంటి ఆందోళన చెందకుండా వచ్చే నెల 15 వరకు స్వల్పకాలిక వరి పంటలు సాగు చేసుకోవాలని వ్యవసాయశాఖ టెక్నికల్ ఏడీఏ రాజ్‌నారాయణ సూచించారు. బుధవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పలువురు రైతులు అడిగిన ప్రశ్నలకు ఏడీఏ సమాధానం ఇచ్చారు. వేసవి దుక్కులతో పాటు పంట మార్పిడి తప్పనిసరిగా చేస్తేనే అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. వంద మి.మీటర్ల వర్షం పడితేనే పత్తిలాంటి ఆరుతడి పంటలు సాగు చేసేందుకు అనుకూల వాతావరణం ఉంటుందని వివరించారు.



మాట్లాడుతున్న ఏడీఏ రాజ్ నారాయణ

వెదజల్లే పద్ధతితో ఎలాంటి లాభాలు ఉంటాయి?
– పరశురాములు, రామాయంపేట

ఏడీఏ: సాధారణ సాగు కోసం 30 కిలోల విత్తనాలు అవసరం అవుతాయి. వెదజల్లే పద్ధతిలో కేవలం 10 కిలోలు సరిపోతాయి. కలుపు నివారణకు గడ్డి మందు పిచికారీ చేసుకోవాల్సి వస్తుంది. ఈ విధానంతో సాగు ఖర్చులు రూ. 10 వేల వరకు ఆదా అవుతాయి.

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి డబ్బులు రావడం లేదు. ఏం చేయాలి?
– జంగం నాగయ్య, రేగోడ్

ఏడీఏ: 31-01-2019 వరకు పట్టాదార్ పాసుబుక్ కలిగి వ్యవసాయశాఖలో నమోదు చేసుకున్న వారికి మాత్రమే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి డబ్బులు వస్తున్నాయి. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే తెలియజేస్తాం.

వరి కోతదశలో అగ్గి తెగులు అధికంగా వస్తుంది. పరిష్కారం చెప్పండి?
– మల్లేశం, కొడిపల్లి

ఏడీఏ: పంటమార్పిడి తప్పనిసరిగా చేయాలి. అలాగే జీలుగా, జనుము, పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేయాలి. పొలం గట్ల వెంట గడ్డి ఉండకుండా శుభ్రం చేసుకోవాలి. నాటు వేసిన తర్వాత లైట్రాప్ ఎరువులు చల్లుకోవాలి.

ప్రస్తుత సీజన్‌లో ఎలాంటి వరి విత్తనాలు వేసుకుంటే దిగుబడి పెరుగుతుంది?
– శంకర్, దంతెపల్లి, రామాయంపేట

ఏడీఏ: వరిలో దొడ్డు రకం, కేఎస్ఎం, 118, జేజీఎల్, 24423 రకాలతో పాటు సన్నరకం కేఎస్ఎం, 1638, ఆర్ఎన్ఆర్, 15048 రకాలు సాగు చేసుకుంటే మంచి దిగుబడి వస్తుంది. ప్రతి మంగళ, శుక్రవారం రైతు వేదికలో అవగాహన సదస్సులు నిర్వహిస్తాం.

ప్రతిఏటా వరిలో పొల్లు అధికంగా పోతుంది. నివారణ చర్యలు చెప్పండి?
– విఠల్‌రెడ్డి, పెద్దశంకరంపేట

ఏడీఏ: వరిలో కాండం తొలిచే పురుగుతో పొల్లు అధికంగా పోతుంది. నారుమడి పోసిన 15 రోజుల్లో గుళికలు లేదా క్లోరో పైరిపాస్ వేసుకోవాలి. వేసవి దుక్కులు తప్పనిసరిగా చేసుకోవాలి.

ఇటీవల తూకం పోశాను. పశువుల పేడ చల్లగా నారు ఎర్రబారుతుంది. ఎలాంటి చర్యలు చేపట్టాలి?
– అంజనేయులు, కొడిపల్లి

ఏడీఏ: వర్షాలు సరిగా పడకపోవడంతో నారుమళ్లు ఎర్రబారుతున్నాయి. పంటకు భూమిలో సరైన పోషకాలు అందడం లేదు. ఫార్ముల 7 లేదా ఫార్ముల 4 మందును నీటిలో కలిపి నారుపై పిచికారీ చేయాలి.

యాసంగిలో వివిధ రకాల తెగుళ్లతో పంట దిగుబడి చాలా తగ్గిపోయింది. ఈసారి ఎలాంటి పంటలు వేసుకోవాలి?
– మధుసూదన్, రుద్రారం, చిన్నశంకరంపేట

ఏడీఏ: తెగుళ్ల నివారణకు ఏకైక కారణం పంట మార్పిడి లేకపోవడం. ముందస్తుగా వేసవి దుక్కులు చేసుకోకపోవడం కూడా కారణం. జీలుగా, జనుము వంటి పచ్చిరొట్టి విత్తనాలు చల్లి బురదలో దున్ని వరి సాగుచేసుకోవాలి.

పత్తి సాగులో ఏరకమైన విత్తనాలు విత్తుకుంటే మంచి దిగుబడి వస్తుంది. తెగుళ్ల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టాలి.
– వీరప్ప, అల్లాదుర్గం

ఏడీఏ: పత్తి సాగులో బీటీ-2 రకం విత్తనాలు మేలు రకమైనవి. ఇవి తెగుళ్లను నివారిస్తాయి. కాకపోతే లద్దె పురుగు ఆశిస్తుంది. దీని నివారణకు మొక్కలు పెరిగాక 25, 45, 65 రోజుల్లో మోనోక్రోటోపాస్ మందును మొక్కల కాండాలపై రుద్దాలి. చేనులో అక్కడక్కడ జిగురు అట్టలు ఉంచితే పురుగులు అతుక్కుపోతాయి.

ఈసారి వర్షాలు ఆలస్యమవుతున్నాయి. ఎలాంటి పంటలు వేసుకోవాలి?
– వేణుగోపాల్‌గౌడ్, చేగుంట

ఏడీఏ: రుతుపవనాలు ఇప్పటికే రావాల్సి ఉండగా ఆలస్యమైంది. స్వల్ప కాలిక పంటలు జూలై 15 వరకు సాగు చేసుకోవచ్చు. ముఖ్యంగా వరిలో వెదజల్లే పద్ధతి చాలా మంచిది. ఆరుతడి పంటల్లో మొక్కజొన్న, కంది, ఆముదంతో పాటు వరిసాగులో స్వల్పకాలిక పంటలు కేఎంఎస్ దొడ్డురకం- 118, సన్నరకం కేఎంఎస్ 1638 మంచివి.

వరి కొయ్యకాళ్లు కాల్చి నాటుకు సిద్ధమైతే సరిపోతుందా? అవి పొలంలోనే మురిగి పోయేందుకు సలహా ఇవ్వండి.
– ప్రవీణ్, శివ్వంపేట

ఏడీఏ: వరి కొయ్యకాళ్లు పొలంలోనే త్వరగా మురిగిపోవాలంటే సింగిల్ సూపర్ పాస్పేట్‌ను దుక్కిలో చల్లి దున్నితే పది రోజుల వ్యవధిలో మురిగిపోతుంది.

ఇటీవలే నారుమడి పోశాను. మొలక సరిగా రావడం లేదు. ఎలాంటి చర్యలు చేపట్టాలి?
– యాదగిరి, కొల్చారం

ఏడీఏ: భూమిలో కార్బండిజం తగ్గినట్లయితే ఈ పరిస్థితి ఏర్పడుతుంది. కొద్దిపాటి యూరియాలో వర్మి కంపోస్టు ఎరువులు కలిపి చల్లితే మొక్కలకు పోషకాలు అందుతాయి.

ప్రస్తుతం పత్తి సాగు చేస్తున్నాం. గడ్డిమందు ఎప్పుడు చల్లాలి?
– నర్సింలు, టేక్మాల్

ఏడీఏ: పత్తి విత్తిన 48 గంటల్లో గడ్డి నివారణ మందు పిచికారీ చేయాలి. పత్తి విత్తే ముందు భూమిలో తేమశాతం చూసుకోవాలి. అలాగే మొక్కలు పెరిగి 2, 3 ఆకులు వచ్చాక పోస్టు యామలైన్ అనే మందును నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

వర్షాలు ఆలస్యమైనందున ఎలాంటి పంటలు సాగు చేసుకోవాలి?
– సిద్దిరాంలు, నిజాంపేట

ఏడీఏ: ఈసారి రుతుపవనాలు ఆలస్యమైనందున 120 నుంచి 125 రోజుల వ్యవధిలో వచ్చే స్వల్పకాలిక వరి పంటలు సాగు చేసుకోవాలి. అలాగే ఆరుతడి పంటల్లో కందితో పాటు అంతర్ పంటలుగా పత్తి, మినుము, పెసర సాగు చేసుకుంటే మంచి దిగుబడి పొందవచ్చు.

జీవ ఎరువుల కోసం ఎవరిని సంప్రదించాలి?
– సురేశ్, శివ్వంపేట

ఏడీఏ: సదాశివపేటలోని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంతో పాటు తునికిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో సంప్రదించవచ్చు.

ఆరేళ్లుగా పొలం బీడుగా ఉంది. ఎలాంటి పంటలు సాగు చేయాలి?
– రాజు, మనోహరాబాద్

ఏడీఏ: మనోహరాబాద్ హైదరాబాద్‌కు దగ్గరగా ఉన్నందున సెలక భూమిలో ఆరుతడి పంటలైన కూరగాయ పంటలు వేసుకోవచ్చు. పత్తి సాగు చేయాలనుకుంటే బీటీ- 2 రకం సాగు చేసుకోవాలి. కూరగాయలు పండిస్తే హైదరాబాద్‌కు తరలించి విక్రయించుకునే అవకాశం ఉంది.

గ్రూప్-4 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ రాజర్షిషా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా, పక్కన ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని

మెదక్ కలెక్టరేట్: జూలై 1వ తేదీన జరగనున్న గ్రూప్-4 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని, అదనపు కలెక్టర్లు రమేశ్, ప్రతిమాసింగ్‌తో కలిసి పరీక్షల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాకు 11,257 అభ్యర్థులను కేటాయించారని తెలిపారు. పరీక్షల నిర్వహణకు జిల్లావ్యాప్తంగా 30 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు నియమించిన రూట్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, లయజన్ అధికారులు సమన్వయంగా పనిచేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగు నీరు, ఇతర వసతులు కల్పించడంతో పాటు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో అన్ని పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయండి

కలెక్టరేట్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కలెక్టర్ రాజర్షిషా ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. బుధవారం మెదక్ పట్టణం ఔరంగాబాద్ శివారులో నూతనంగా నిర్మిస్తున్న సమీకృత కలెక్టరేట్ భవనాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూలీలను ఎక్కువగా పెట్టుకొని పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, జెడ్పీ వైస్‌చైర్మన్ లావణ్యరెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత, తదితరులు

గైర్హాజరైన వారికి నోటీసులివ్వండి

ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

మెదక్ కలెక్టరేట్: జెడ్పీ సమావేశానికి రాని వారికి నోటీసులు జారీ చేయాలని జెడ్పీ సీఈఓను ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి ఆదేశించారు. జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత శేఖర్‌గౌడ్ అధ్యక్షతన బుధవారం మెదక్ జెడ్పీ కార్యాలయంలో స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. సాయంత్రం జిల్లాలో జరిగిన అభివృద్ధి పనులపై 7వ స్థాయీ సంఘ సమావేశానికి ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా మిషన్ భగీరథ, ట్రాన్స్‌కో ఏడీ హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లిలో ట్యాంక్‌ను కూల్చారు. కొత్తది ఎందుకు కట్టలేదని మిషన్ భగీరథ అధికారులను ప్రశ్నించారు. కేజ్‌వీల్స్‌తో రోడ్లను పాడు చేస్తున్న ట్రాక్టర్ యజమానులను గుర్తించి జరిమానా విధించాలన్నారు. అనంతరం శివ్వంపేట జెడ్పీటీసీ మహేష్‌గుప్తా మాట్లాడుతూ.. మిషన్ భగీరథ ట్యాంక్‌లను 4 నెలల పాటు కట్టారు. పాత కనెక్షన్లు తొలగించి కొత్త కనెక్షన్లు ఇవ్వడం లేదన్నారు. మండలంలో 36 గ్రామ పంచాయతీలల్లో సీసీ రోడ్లు మంజూరు కాగా కేవలం ఒక్క గ్రామంలో నిర్మించారని తెలిపారు. అలాగే శివ్వంపేటలోని పెద్ద చెరువు అభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరై ఆరేళ్లు గడుస్తున్నా అధికారులు పనులు చేపట్టకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం నిజాంపేటలోని ఎస్సీ, చాకలి బస్తీల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందని జెడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఉదయం జరిగిన 4వ స్థాయీ సంఘం సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత కంటి వెలుగు, ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులపై చర్చించారు. వర్షాకాలం ప్రారంభం అయినందున విద్యుత్ నియంత్రణ తీగల వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ వెంకట శైలేష్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సృజనాత్మకత వెలికితీతకే పోటీలు



యువ ఉత్సవ్‌ను ప్రారంభిస్తున్న కాలేజీ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీప్రసాద్, పక్కన అధికారులు

నర్సాపూర్: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యం, సృజనాత్మకతను వెలికి తీసేందుకు పోటీలు దోహదపడతాయని బీవీ రాజు ఇంజనీరింగ్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం కాలేజీలో కేంద్ర యువజన, వ్యవహారాలు క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి యువ ఉత్సవ్- 2023 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా రచన, కవిత్వం, చిత్రలేఖనం, మొబైల్ ఫొటోగ్రఫీ, ఉపన్యాసం, సాంస్కృతిక, జానపద కళలు తదితర అంశాలపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా యువజన అధికారి రంజిత్‌రెడ్డి, 33 బెటాలియన్ సుబేదార్ మేజర్ సురేంద్ర గురుంగ్, శివశంకర్, డీడబ్ల్యూఓ బ్రహ్మాజీ, యువజన క్రీడల శాఖ అధికారి నాగరాజు, నెహ్రూ యువకేంద్ర ప్రోగ్రాం అధికారి కిరణ్ కుమార్, సంపత్‌రెడ్డి, పోస్టల్ శాఖ జిల్లా ప్లానింగ్ అధికారి జ్యోతి, వ్యవసాయ శాస్త్రవేత్త శోభారాణి, యూనియన్ బ్యాంకు అధికారి రాజు, ఎంఈఓ బుచ్చానాయక్, సీడీపీఓ హేమభార్గవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ప్రమోద్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



శిక్షణ పూర్తిచేసుకున్న మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న అధికారులు

కౌడిపల్లి(నర్సాపూర్): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అదనపు డీఆర్‌డీఓ భీమయ్య పేర్కొన్నారు. బుధవారం కౌడిపల్లి ఐకేపీ కార్యాలయంలో ఎస్‌బీఐ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి హాజరై సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు శిక్షణను సద్వినియోగం చేసుకుని వ్యాపారంలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ శిక్షణ సంస్థ డైరెక్టర్ వంగ రాజేంద్రప్రసాద్, ఏపీఎం సంగమేశ్వర్, సీసీలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వందశాతం స్వచ్ఛత కలిగి ఉండాలి



కొల్చారం: డంప్‌యార్డును పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ రామారావు

తూప్రాన్, కొల్చారం(నర్సాపూర్): ప్రతి గ్రామం వందశాతం స్వచ్ఛత కలిగి ఉండాలని పంచాయతీ రాజ్ డిప్యూటీ కమిషనర్ రామారావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని యావపూర్ గ్రామాన్ని స్వచ్ఛ సర్వేక్షన్ కమిటీ బృందం సందర్శించింది. ఈసందర్భంగా గ్రామంలో మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, చెత్త సేకరణ, డంపింగ్ యార్డు తదితర అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈసందర్భంగా సర్పంచ్ నర్సింహారెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ శ్రీనివాస్‌రావు, ఎంపీడీఓ అరుంధతి, ఎంపీఓ రమేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం కొల్చారం మండల పరిధిలోని కొంగోడు గ్రామ పంచాయతీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ రామారావు పరిశీలించారు. గ్రామ నర్సరీ, డంప్‌యార్డ్, పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయానికి చేరుకొని అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ఈసందర్భంగా గ్రామ పంచాయతీ సిబ్బంది, పాలకమండలికి పలు సూచనలు చేశారు. కమిషనర్ వెంట సర్పంచ్ కుకునూరి మంజుల, ఎంపీఎం కృష్ణవేణి, ఏపీఓ మహిపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, తదితర అధికారులు ఉన్నారు.

వడ్ల పైసలకు తప్పని తిప్పలు



సిండికేట్ బ్యాంకు వద్ద రైతుల పడిగాపులు

వెల్దుర్తి(తూప్రాన్): వడ్ల పైసలు తీసుకోవడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. వర్షాలు ప్రారంభం కావడంతో పెట్టుబడికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. బుధవారం వెల్దుర్తి మండల కేంద్రంలోని సిండికేట్ బ్యాంక్ వద్ద రైతులు ఉదయం నుంచే బారులు తీరారు. వీరిని కంట్రోల్ చేయడానికి పోలీసులు సైతం బ్యాంకు వద్ద ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులు రావడం లేదని.. వచ్చినా రోజుకు రూ. 10 వేలకు మించి ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వడ్ల పైసలు సకాలంలో అందేలా చూడాలని కోరారు.

శాంతియుతంగా పండగలు జరుపుకోవాలి

మెదక్ మున్సిపాలిటీ: ప్రశాంత వాతావరణంలో పండగలు జరుపుకోవాలని డీఎస్పీ సైదులు సూచించారు. బక్రీద్‌ను పురస్కరించుకొని బుధవారం మెదక్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ సాయిరాం, మున్సిపల్ కమిషనర్, మెదక్ టౌన్ సీఐ, ఎస్ఐ, ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం

కొండాపూర్(సంగారెడ్డి): నాగర్ కర్నూలు, నిజామాబాద్ జిల్లాలలో ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మహేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నాగర్ కర్నూలు, నిజామాబాద్ జిల్లాల్లో కలెక్టర్ కార్యాలయాల ధర్నాకు వెళ్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులను పోలీసులు మధ్యలో అడ్డగించి, అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

బిల్ కలెక్టర్‌పై ఫిర్యాదు

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ మేజర్ గ్రామపంచాయతీ బిల్ కలెక్టర్ గత నెల నుంచి రావడం లేదని గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది ఫిర్యాదు మేరకు బుధవారం ఎంపీడీఓ శ్రీనివాస్‌వర్మ పంచాయతీ రికార్డును తనిఖీ చేశారు. రికార్డుల ప్రకారం బిల్ కలెక్టర్ రావడం లేదని నిర్ధారణకు రావడంతో ఆయనకు నోటీస్ జారీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామస్థుల ఫిర్యాదు మేరకు రికార్డులను తనిఖీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన మందుబాబులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, బీజేఆర్ చౌరస్తాతో పాటు రాజీవ్ రహదారిపై సిబ్బందితో కలిసి నాలుగు రోజుల క్రితం వాహనాల తనిఖీ నిర్వహించగా 6గురు మద్యం తాగి వాహనాలు నడుపుతు పట్టుబడ్డారు. వారిని బుధవారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన ద్వితీయశ్రేణి న్యాయమూర్తి రమేశ్‌బాబు వారికి రూ.14,500 జరిమానా విధించింది. వారిలో ఒకరికి ఐదు రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు

బెజ్జంకి(సిద్దిపేట): అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని బెజ్జంకి ఎస్ఐ ప్రవీణ్‌రాజ్ హెచ్చరించారు. మండలంలోని గాగిళ్లాపూర్ శివారులో బుధవారం బెజ్జంకి తహసీల్దార్ విజయ ప్రకాశ్‌రావు ఆదేశాల మేరకు ఆకస్మిక తనిఖీ చేశారు. అక్రమంగా నిలువ ఉంచిన మూడు ఇసుక డంపులను స్వాధీనం చేసుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. కార్యక్రమంలో రెవెన్యూ పరిశీలకులు రాజయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నివారణకు చర్యలు తీసుకోండి

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారంలో భారీ వాహనాల రాకపోకలతో ట్రాఫిక్‌కుతీవ్ర అంతరాయం ఏర్పడుతుందని, పలు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని ఆరోపిస్తు బీజేపీ నాయకులు బుధవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ సాయికిరణ్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్‌లు మాట్లాడారు. బొల్లారంలో భారీవాహనాలు పట్టణం నుంచి కాకుండా ఇతర రహదారులగుండా వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రవీందర్‌రెడ్డి, లక్ష్మణ్, ఆనంద్‌కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అస్వస్థతతో యువకుడి మృతి

చిన్నశంకరంపేట(మెదక్): గవ్వలపల్లి గ్రామానికి చెందిన టీఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి లచ్చిగల్ల దేవయ్య కుమారుడు లచ్చిగల్ల సాయిబాబా అస్వస్థతతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం స్వల్ప జ్వరంతో బాధపడుతూ మెదక్ ఏరియా ఆస్పత్రికి వైద్యం నిమిత్తం వెళ్లాడు. అక్కడ చికిత్స పొందుతూ తీవ్రమైన జ్వరంతో అస్వస్థతకు గురై మృతి చెందాడు.



మాచాపూర్‌లో దుక్కిదున్నుతున్న రైతు



విఠలాపూర్‌లో విత్తనాలు వేస్తున్న రైతులు

దుక్కి దున్ని.. విత్తనాలు విత్తి..

ఇటీవల కురుస్తున్న వర్షాలతో అన్నదాతలు పొలంబాట పట్టారు. పనుల్లో బిజీబిజీ అయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. దుక్కి దున్ని విత్తనాలు వేస్తున్నారు. ఏ పొలంలో చూసినా రైతులు, కూలీల సందడే కనిపిస్తోంది. మొక్కజొన్న, పత్తి విత్తనాలు వేస్తుండగా, కొందరు రైతులు ఎరువులు చల్లుతున్నారు. చిన్నకోడూరు మండల పరిధిలోని మాచాపూర్, విఠలాపూర్ గ్రామాల్లో పొలం పనుల్లో ఉండగా సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

–సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట



మొక్కజొన్న విత్తనాలు వేస్తున్న రైతులు




ఎరువు చల్లుతున్న రైతులు

కారుమబ్బులు కమ్మేశాయి..

వాతావరణంలో కారుమబ్బులు కమ్ముకున్నాయి. అవి చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఇది వాతావరణంలో వచ్చిన మార్పులకు అద్దం పడుతుంది. ఈ చిత్రాలు..కొన్ని క్షణల్లోనే మోడువారి చెట్టును..తలపించి ఆకాశంలో కారుమబ్బు చేస్తున్న అద్భుత దృశ్యాలు చిన్నకోడూరు మండల పరిధిలోని విఠలాపూర్ గ్రామశివారులో సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

–సాక్షి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, సిద్దిపేట



రుద్రారంలో కార్డన్ సెర్చ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

- 48 ద్విచక్ర వాహనాలు సీజ్
- తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): ప్రజలను చైతన్య పరిచేందుకే పోలీస్ కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి అన్నారు. బుధవారం చిన్నశంకరంపేట మండలం రుద్రారంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు, చలాన్లు పెండింగ్‌లోఉన్న 48 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి వాహనాలను వాటి పత్రాలను పరిశీలించారు. అనంతరం డీఎస్పీ యాదగిరిరెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజలను అప్రమత్తం చేసేందుకు కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. గ్రామంలో కొత్త వ్యక్తులు, అనుమానితులు ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ముఖ్యంగా గుర్తుతెలియని వ్యక్తులు తక్కువ ధరకు విక్రయించే ద్విచక్ర వాహనాలను కొనుగోలు చేయొద్దన్నారు. ప్రతీ ఒక్కరు వహనాల పత్రాలను కలిగి ఉండడంతో పాటు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనాలను నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని కోరారు. ఈ కార్యక్రమలో చిన్నశంకరంపేట, చేగుంట, నార్సింగి ఎస్ఐలు సుభాష్‌గౌడ్, ప్రకాష్‌గౌడ్, నర్సింహులు, రామ్‌చందర్‌నాయక్, సర్పంచ్ లక్ష్మినారాయణ, ఉపసర్పంచ్ ప్రసాద్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న విద్యార్థి మృతి



ప్రశాంత్ (ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): ఇష్టం లేని చదువు చదవలేనని తల్లిదండ్రులకు చెప్పలేక బాధపడుతూ పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన అక్కన్నపేట మండలం గొల్లపల్లిలో చోటుచేసుకుంది. ఎస్ఐ తాండ్ర వివేక్ తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన గెంటే ప్రశాంత్(23)హనుమకొండలోని శ్రీచైతన్య కాలేజీలో ఎంసీఏ చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో అతనికి చదువు అంటే ఇష్టం లేక తను లోలోప మనోవేదనానికి గురవుతూ ఈ నెల 20వ తేదీన ఇంట్లో ఎవరికి చెప్పకుండా వ్యవసాయ క్షేత్రంలో ఏదో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. పురుగుల మందు తాగినట్లు ఫోన్‌లో తన బావ సురేష్‌కు విషయమంతా చెప్పాడు. దీంతో హుటాహుటిన ములుగు ముల్కనూర్‌లోని ఓ ప్రవేట్ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. తల్లి గంటే లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గుండెపోటుతో జూనియర్ అసిస్టెంట్..



బాబు (ఫైల్)

గజ్వేల్‌రూరల్: గుండెపోటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ జూనియర్ అసిస్టెంట్ మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి..చిన్నకోడూరు మండలం అల్లీపూర్‌కు చెందిన సంగెం బాబు వీఆర్వోగా విధులు నిర్వహించేవాడు. ప్రభుత్వం వీఆర్వోల వ్యవస్థను రద్దు చేయడంతో గజ్వేల్ పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా గతేడాది ఆగస్టులో విధుల్లో చేరాడు. బాబు రెండ్రోజుల క్రితం గుండెపోటుకు గురవడంతో కుటుంబ సభ్యులు వెంటనే సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా అక్కడ మరోసారి గుండెపోటు రావడంతో బుధవారం మృతి చెందాడు. గజ్వేల్ ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపక బృందం సంతాపం వ్యక్తం చేశారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడి మృతి



అస్పాక్(ఫైల్)

వట్‌పల్లి(అందోల్): బతుకు దెరువు కోసం వచ్చిన జేసీబీ క్లీనర్ అనుమానాస్పదంగా మృతి చెందాడు. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..రాజస్థాన్‌లోని భరత్‌పూర్ జిల్లా కైత్వార్ గ్రామానికి చెందిన అస్పాక్ (17) వట్‌పల్లికి చెందిన కలాలి యాదగిరి గౌడ్ దగ్గర జేసీబీ క్లీనర్‌గా గత కొంతకాలంగా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి పనిని ముగించుకుని వెంకటఖాజా దర్గాకు సంబంధించిన గదిలో పడుకున్నాడు. బుధవారం ఉదయం యజమాని గది లోపలికి వెళ్లి చూడగా అస్పాక్ విగతజీవిగా పడి ఉన్నాడు. దీంతో అతను పోలీసులకు, మృతుని తల్లిదండ్రులకు సమాచారం చేరవేశాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యజమానితో గొడవ..

అదే రాత్రి డబ్బుల విషయంలో యజమానితో గొడవ జరిగిందని అస్పాక్ తమకు ఫోన్ చేశాడని జేసీబీ డ్రైవర్లు పేర్కొన్నారు. మరుసటి రోజే మృతి చెందడంపై తమకు అనుమానం ఉందని వారు ఆరోపించారు. మృతుని సెల్‌ఫోన్ కనిపించడం లేదని, ఫోన్‌చేస్తే స్విచాఫ్ వస్తుందన్నారు. ఫోన్‌లో ఏమైన ఆధారాలు ఉంటాయని పోలీసులతో డ్రైవర్లు చెబుతున్నారు.

బ్రెయిన్‌స్ట్రోక్‌తో ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ నరేష్...



నరేష్(ఫైల్)

గజ్వేల్‌రూరల్: బ్రెయిన్ స్ట్రోక్‌తో దాచారం గ్రామానికి చెందిన ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ ఏలేశ్వరం నరేష్(32) మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి..గ్రామానికి చెందిన నరేష్ తనకున్న భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామంలోని పాఠశాలలో విద్యా కమిటీ చైర్మన్‌గా అతను బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి స్వల్ప అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు వెంటనే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి బుధవారం దాచారంలో మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బావిలో దూకి యువకుడి ఆత్మహత్య



మృతదేహాన్ని వెలికి తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కోహీర్(జహీరాబాద్): బావిలో దూకి యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం..మృతుడు కమ్మరి గోవింద్(25) గ్రామం పక్కనే డేరా వేసుకొని కమ్మరి పని చేసుకొని జీవిస్తున్నాడు. మంగళవారం రాత్రి భార్యాభర్తలు గొడవ పడ్డారు. గోవింద్ తాగిన మైకంలో పక్కనే ఉన్న కొత్త బావిలో దూకాడు. భార్య లక్ష్మి అరుపులకు గ్రామస్థులు సంఘటన స్థలానికి చేరుకొని గోవిందును రక్షించడానికి చేసిన ప్రయత్నం ఫలించలేదు. బావి లోతుగా ఉండడంతో బుధవారం మధ్యాహ్నం అగ్నిమాపక సిబ్బంది మృతదేహాన్ని వెలికి తీశారు. పోలీసులు మృతదేహాన్ని జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టమ్ నిమిత్తం తరలించారు. భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పాఠ్యపుస్తకాల అక్రమ అమ్మకాలు



పాఠ్యపుస్తకాలు అక్రమ అమ్మకాలు నిర్వహిస్తున్న బుక్‌స్టాల్

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుక్ స్టాల్ సీజ్

తూప్రాన్: పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం అక్రమంగా పాఠ్యపుస్తకాలు విక్రయించడాన్ని ఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ బుచ్యానాయక్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఎంఈఓ పాఠ్యపుస్తకాలు కలిగిన గదిని సీజ్ చేశారు. ఒక్కో విద్యార్థి నుంచి రూ.3 వేల నుంచి రూ.6వేల వరకు వసూలు చేస్తున్న ప్రైవేటుస్కూల్ యాజమాన్యం జిల్లా అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా విక్రయిస్తున్నారని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. ఎంఈఓ ఆఫీస్ నుంచి మండల వ్యాప్తంగా నోటీసులు జారీ చేసి వారం రోజులు గడుస్తున్నా యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన లేదు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలల్లో ఫీజులు దోచుకుంటున్న యాజమాన్యంపై చర్యలు తీసుకొని పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు

సీఐ నయీముద్దీన్

జిన్నారం(పటన్‌చెరు): శాంతి భద్రతలను పరిరక్షించేలా చర్యలు చేపడుతామని, ప్రజల సహకారంతో నేరాల సంఖ్యను తగ్గిస్తామని బొల్లారం సీఐ నయీముద్దీన్ అన్నారు. బుధవారం జిన్నారం మండలంలోని బొల్లారంలో సీఐ మాట్లాడారు. బొల్లారం, గడ్డపోతారం, ఖాజీపల్లిలు పారిశ్రామిక ప్రాంతాలు కావడంతో అక్కడ తగిన బందోబస్తును ఏర్పాటు చేయిస్తామన్నారు. పారిశ్రామిక వాడల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలుతీసుకుంటామన్నారు. నేరాలను తగ్గించడంలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలన్నారు. చోరీలను పూర్తి స్థాయిలో నివారించేల చూస్తామన్నారు.

ఇద్దరు విద్యార్థులపై కేసు నమోదు

కొండపాక(గజ్వేల్): అకారణంగా సీనియర్ విద్యార్థిపై దాడి చేసిన జూనియర్ విద్యార్థులు ఎండీ ఇబాయత్, ఆదిత్యవర్ధన్‌రెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు కుకునూరుపల్లి ఎస్ఐ పుష్పరాజ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి..వెలికట్ట గ్రామ శివారులోని శ్రీకృప ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసిటీకల్ సైన్సు కాలేజీలో చేర్యాలకు చెందిన సమీర్ ఫైనల్ ఇయర్ విద్యనభ్యసిస్తున్నాడు. అదే కాలేజీలో చదువుతున్న జూనియర్ విద్యార్థులు ఇబాయత్, ఆదిత్యవర్ధన్‌రెడ్డిలే ఓ అమ్మాయి విషయంలో మంగళవారం కాలేజీ సమీపంలో అకారణంగా దాడి చేశారు. చంపుతామంటూ బెదిరించారన్నారు. దీంతో సమీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కాలేజీ నుంచి డీబార్ చేశాం : ప్రిన్సిపాల్ మంజునాథ్

కాలేజీ పేరు ప్రతిష్ఠలను దెబ్బతిసేలా వ్యవహరించిన ఇద్దరు విద్యార్థులు ఇబాయత్, ఆదిత్యవర్ధన్‌రెడ్డిలను కాలేజీ నుంచి సస్పెండ్‌చేశామని ప్రిన్సిపాల్ మంజునాథ్ తెలిపారు.

పరిశ్రమ యాజమాన్యంపై పోలీసులకు ఫిర్యాదు

చిన్నశంకరంపేట(మెదక్): చందంపేట-రుద్రారం పెద్ద చెరువులో వ్యర్థాలను వదులుతున్నారని ఓ పరిశ్రమపై రుద్రారం సర్పంచ్ మంచాల లక్ష్మణ్, గ్రామస్తులు చిన్నశంకరంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్టీల్ అండ్ ఐరన్ పరిశ్రమలోని వ్యర్థపదార్థాలను సంచుల్లో నింపి చెరువులో వదులుతున్నట్లు గ్రామస్థులు ఆరోపించారు. ఇందులో దుర్వాసనతో కూడిన వ్యర్థాలు ఐరన్ పౌడర్ ఉందని వెంటనే కంపెనీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ విషయంపై విచారించి చర్యలు చేపట్టాలని డీఎస్పీ యాదగిరిరెడ్డి చిన్నశంకరంపేట ఎస్ఐ సుభాష్‌గౌడ్‌ను ఆదేశించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

సిద్దిపేటరూరల్: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకునాన్నాడు. మృతుని భార్య రమ్య తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన వసూరి రాజు(30) గత కొంతకాలంగా తనకున్న 35 గుంటల భూమిని సాగుచేస్తున్నాడు. పెట్టుబడుల కోసం పలు చోట్ల అప్పులు చేశాడు. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో పంట పూర్తిగా దెబ్బతింది. చేసిన అప్పులు తీర్చే మార్గం లేక కొంతకాలంగా తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో బుధవారం బావి వద్దకు వెళ్తున్నట్టు ఇంట్లో చెప్పి వెళ్లాడు. భర్త రాజు ఎంతకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతని కోసం వెతికారు. మృతుని తండ్రి నారాయణ వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూడగా అక్కడ చెట్టుకు ఉరివేసుకున్నాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేస్ నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

బ్యాంక్ ఖాతా వెరిఫికేషన్ పేరుతో సైబర్ మోసం



సిద్దిపేటకమాన్: బ్యాంక్ ఖాతా వెరిఫికేషన్ పేరుతో ఫోన్ కాల్‌కు స్పందించి మోసపోయిన సంఘటన సిద్దిపేట పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తికి యాక్సిక్ బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నానంటూ ఫోన్ వచ్చింది. బ్యాంక్ ఖాతా (బ్యాంక్ అకౌంట్) వెరిఫికేషన్ చేస్తున్నామని గుర్తు తెలియని వ్యక్తి నమ్మబలికాడు. ఫోన్‌కు వచ్చిన లింకుకు స్పందించాడు. ఆ లింకులో తన వివరాలు నమోదు చేయాలని 24 గంటల్లో యాక్టివేట్ అవుతుందని సూచించాడు. అది నమ్మిన బాధితుడు గుర్తు తెలియని వ్యక్తి చెప్పిన విధంగా చేశాడు. దీంతో కార్డు వివరాలు చెప్పడంతో పాటు సీవీవీ నెంబర్ నమోదు చేశాడు. తన ఖాతా నుంచి రూ.38,757 డెబిట్ అయినట్లు సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. అనుమానం వచ్చిన బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు.

శివ్వంపేటలో ఇరువర్గాల ఘర్షణ

డీఎల్‌పీఓ ముందు తోపులాట



ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలో అధికార పార్టీకి చెందిన ఇరువర్గాలు ఘర్షణ పడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..శివ్వంపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన స్థలాన్ని గ్రామ పంచాయతీ ఆక్రమించుకుని పలు నిర్మాణాలు చేపట్టిందని మాజీ సర్పంచ్ భర్త నవీన్‌కుమార్‌గుప్తా, మాజీ ఎంపీటీసీ భర్త జంగం వెంకటేష్ వర్గీయులు సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ రాజర్షిషాకు ఫిర్యాదు చేశారు.

విచారణ అధికారి ముందు..

ఈ విషయంలో క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాల్సిందిగా డీఎల్‌పీఓ యాదయ్యకు కలెక్టర్ ఆదేశించారు. ఈ క్రమంలో డీఎల్‌పీఓ బుధవారం శివ్వంపేటలో విచారణకు వచ్చారు. డీఎల్‌పీఓ ముందు మాజీ సర్పంచ్ భర్త నవీన్‌గుప్తా, సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ వర్గీయులు గొడవకు దిగారు. ఒకరినొకరు దూషించుకుంటూ, బూతు మాటలతో తోపులా డుకున్నారు. ఘర్షణ పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు.

కలెక్టర్‌కు నివేదిస్తా : డీఎల్‌పీఓ

పీహెచ్‌సీ స్థలంలోని పలు కట్టడాలు తొలగించిన విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు నేపథ్యంలో విచారణ చేపట్టినట్లు డీఎల్‌పీఓ యాదయ్య చెప్పారు. ఆసుపత్రి సిబ్బంది, గ్రామస్తులు, సర్పంచ్, మాజీ సర్పంచ్ ద్వారా సేకరించిన వివరాలు కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ తిరుపతిరెడ్డి, కార్యదర్శి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి.. పలువురికి గాయాలు

వేర్వేరు సంఘటనల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. ములుగు, మనోహరబాద్ ప్రాంతాల్లో పలువురు గాయపడ్డారు. తీవ్రంగా గాయపడ్డవారిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు.

ఇసుకలారీ ఢీకొని వ్యక్తి..

పాపన్నపేట(మెదక్): ఇసుకలారీ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నార్సింగి శివారు దారిదేవుని ఆలయ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..గుర్తు తెలియని వ్యక్తి (60) సైకిల్‌పై పాపన్నపేట నుంచి నార్సింగి వైపుకు వెళ్తుండగా ఆవైపుగానే వేగంగా వస్తున్న ఇసుకలారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పూజారి ...



రాజేశ్వర్ మృతదేహం

రామాయంపేట(మెదక్): లక్ష్మాపూర్ గ్రామశివారులో మంగళవారం రాత్రి లారీ, కారు ఢీకొన్న సంఘటనలో పూజారి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి..హవేళి ఘన్‌పూర్ మండలం శమ్నాపూర్‌కు చెందిన జంగం రాజేశ్వర్(48) రాజ రాజేశ్వర ఆలయంలో పూజారిగా పనిచేస్తున్నాడు. అతను మరో ఇద్దరితో కలిసి కారులో రామాయంపేటవైపు వస్తుండగా, ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రాజేశ్వర్‌ను 108 అంబులెన్సులో రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని పేర్కొన్నారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుని భార్య ఫిర్యాదుమేరకు ఎస్ఐ రంజిత్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రాజీవ్‌రహదారిపై..

ములుగు(గజ్వేల్): ములుగు శివారులోగల హవేలీ ఫామ్ ఎదురుగా రాజీవ్‌రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు ప్రయాణీకులకు స్వల్ప గాయాలయినట్లు ఎస్ఐ రంగ కృష్ణ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి..హైదరాబాద్ నుంచి గజ్వేల్‌వైపు వస్తున్న గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో బస్సు ములుగు శివారులోకి చేరుకోగానే ముందు వెళ్తున్న డీసీఎం వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో బస్సు ముందు సీటులో కూర్చున్న ప్రయాణీకులు సుబాష్‌గాంధీ, కవిత, లావణ్య మరికొందరితో పాటు డీసీఎం వాహనంలో ప్రయాణిస్తున్న అన్వర్, చాంద్‌పాషా, కృష్ణలకు గాయలయ్యాయి. వారిని లక్ష్మక్కపల్లి ఆర్‌వీఎం, గజ్వేల్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స నిమిత్తం తరలించారు. ఆర్టీసీ బస్సును అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్ రాధాకృష్ణపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మనోహరాబాద్ మండల కేంద్రానికి చెందిన అవ్వసుల శ్రీధరాచారి జాతీయ రహదారి-44పై రోడ్డు దాటుతుండగా మేడ్చల్ వైపు నుంచి నిజామాబాద్‌కు వెళుతున్న గుర్తు తెలియని కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో అతనికి తీవ్రగాయాలయ్యాయి. బాధితుణ్ని చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.